# అగ్గిపుల్ల

బాలకృష్ణ అగ్గిపుల్ల గీచాడు...!

అగ్గిపుల్ల వెలిగి ఆరిపోయింది.

సిగరెట్టు వెలగలేదు...

బాలకృష్ణ సిటీ బస్టాపులో నిలబడ్డాడు. బస్సులు వస్తూపోతూ ఉన్నాయి.

బాలకృష్ణ చంకలో రెండు నోట్ పుస్తకాలు ఉన్నాయి. అతను సన్నగా, పొడవుగా ఉన్నాడు. నీలం రంగు జీన్‌పాంటులో, గోధుమరంగు టీ షర్టు ఇన్‌షర్టు చేసుకున్నాడు. పొడుగాటి జులపాల జుట్టు మెడమీదకు వేలాడుతోంది.

బాలకృష్ణ డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు.

మధ్యాహ్నం ఒంటిగంటన్నర...!

రోడ్డు మీద జనం సినిమాహాళ్ల వైపు పరుగులు పెడుతున్నారు...

ఒక సిటీ బస్సు వచ్చి ఆగింది.

బస్టాపులోంచి ముగ్గురు మనుషులు ఆ బస్సు ఎక్కి కూర్చున్నారు. బాలకృష్ణ ఆ బస్సు ఎక్కాలా, వద్దా అనుకుంటూ ఆలోచనలో ఉండగానే బస్సు వెళ్లిపోయింది.

బాలకృష్ణ మరో అగ్గిపుల్ల గీశాడు.

సిగరెట్టు వెలిగించుకునేలోపుగా అది కాస్తా ఆరిపోయింది.

అతను బస్టాపులోని మిగిలినవాళ్లని చూశాడు. నోట్లో చుట్ట పెట్టుకుని కూర్చున్న ఓ పల్లెటూరు తాత... తాత పక్కనే ముసలమ్మ... భుజానికి వానిటీ బ్యాగ్ తగిలించుకున్న రెండు జడల అమ్మాయి... మెడలో మఫ్లరు, లాల్చీ పైజమాలో ఉన్న బట్టతల మనిషి...

"ఆనంద్ థియేటర్‌లో 'ప్రేమించుకుందాం రా!" ఆడుతోంది. అది బాస్ సూపర్‌హిట్ పిక్చర్. దాన్నప్పుడే తను అయిదుసార్లు చూశాడు. ఆరోసారి మాట్నీ చూసేస్తే... ఒక పనయిపోతుందేమో!

బాలకృష్ణ మూడో అగ్గిపుల్ల గీశాడు. సిగరెట్ వెలిగించుకోబోయాడు. అదీ గాలికి టప్‌మని ఆరిపోయింది.

"ఛీ! ఛీ! వెధవ అగ్గిపుల్లలు!" మనసులో కసిగా తిట్టుకున్నాడు.

బస్టాపులో వారగా నిలబడ్డ రెండుజడల అమ్మాయి బావుంది. అమ్మాయికి ఆ రెండు జడలే బాగాలేవు. 'ఆమని'లా ఉంది. చదువుకుంటోందో, ఉద్యోగం చేస్తోందో... జీవితంలో పెళ్లంటూ చేసుకుంటే ఇలాంటి అమ్మాయినే పెళ్లి చేసుకోవాలి. అబ్బో, తన

పెళ్లి ఎప్పటిమాట...? డిగ్రీ పూర్తవ్వాలి... ఏదో ట్రెయినింగుకు వెళ్లాలి... ఉద్యోగం రావాలి! మేనమామ కూతరు మహాలక్ష్మితో తన పెళ్లంటుంది అమ్మ. మహాలక్ష్మి అస్సలు తనకు జోడీ కాదు. సన్నగా, తీగెలా, పాలిపోయిన మొహంతో పిండిబొమ్మలా ఉంటుంది. ఈసారి ఇంటికి వెళ్లినప్పుడు అమ్మతో ఖచ్చితంగా తన అభిప్రాయం చెప్పాలి... కానీ మేనమామ మూడు లక్షలు కట్నం ఇస్తానంటున్నాడట... ఏవిటి చేయడం?

బాలకృష్ణ మళ్లీ బస్టాపులోని అమ్మాయివైపు ఆసక్తిగా చూశాడు.

కొంపదీసి ఈ అమ్మాయి కూడా "ప్రేమించుకుందాం రా!" సినిమాకు వెళ్తోందా? అడిగితేనో... అమ్మో...! చెంప పగలగొడుతుందేమో! ఆడపిల్లా... అగ్గిపుల్లా! అన్నారు కదూ!

బాలకృష్ణ మరో అగ్గిపుల్ల గీశాడు. అదీ వెలగలేదు. అగ్గిపుల్లని వేళ్ల మధ్యనుంచి నిర్లక్ష్యంగా విసిరికొట్టాడు.

వచ్చేవారం ఇంటికి పోవాలి. రెండు ఉత్తరాలు రాసినా నాన్న మనియార్డరు పంపించలేదు. మెస్సుకు డబ్బులు కట్టాలి. చిన్న చిన్న చేబదుళ్లు తీర్చాలి.

బాలకృష్ణ చిన్నగా నిట్టూర్చాడు.

కాలేజీ బోర్... క్లాసులు బోర్... లెక్చరర్స్ బోర్... ఎక్కడ సిలబస్ అక్కడే ఉంది. లెక్చరర్స్ వస్తారు... క్లాసులు జరగవు... లెక్చరర్స్ రారు... క్లాసులు జరుగుతాయి.

బస్టాపులోకి తొమ్మిదో నంబరు బస్సు వచ్చింది. ఈ బస్సు తన రూముకు పోతుంది. పోనీ రూమ్‌కి పోదామా? రూమ్మేట్ మధుగాడు రూమ్‌లో ఉండడు. వాడికి అమ్మాయిల పిచ్చి... ఆడపిల్లలు తనంటే పడి చస్తారంటాడు. అమ్మాయిల్ని ప్రేమించడం ఒక కళ అంటాడు. మొన్నొకరోజు సుజాతని గదికి తీసకువచ్చాడు. ఒకటే కబుర్లు... గుసగుసలు... తనకు సైగ చేసి బయటకు పొమ్మన్నాడు. ఇడియట్... వాడివల్లే ఈ సిగరెట్ కాల్చడం అలవాటయింది. రోజుకు అయిదారు సిగరెట్లు కాలుస్తున్నాడు...

బాలకృష్ణ ఆలోచనల్లో ఉండగానే బట్టతలమనిషి బస్సెక్కి కూర్చున్నాడు. తొమ్మిదో నెంబరు బస్సు కూడా తుస్సుమంటూ ఇంత కాలుష్యాన్ని వదిలి వెళ్లిపోయింది.

హాయిగా మాట్నీ చూసి రూమ్‌కెళ్లిపోతే సరి... జేబులో డబ్బులు సరిపోతాయా?

ఏవిటో, ఒక అగ్గిపుల్లా వెలగటం లేదు... డర్టీ మాచెస్!

బాలకృష్ణ ఈసారి గుప్పెటగా చేతులు అడ్డం పెట్టుకున్నాడు. నిలకడగా దృష్టి నిలిపాడు... జాగ్రత్తగా అయిదో అగ్గిపుల్ల గీశాడు. అగ్గిపుల్ల వెలిగింది. సిగరెట్ అంటుకుంది. బాలకృష్ణ గుండెలనిండా సిగరెట్ పొగ పీల్చాడు. విలాసంగా పొగ వదులుతూ బస్టాపులోని అమ్మాయివైపు క్రీగంట చూశాడు. జేబులోని దువ్వెన తీసుకుని తన 'బాస్'ని అనుకరిస్తూ తల దువ్వుకున్నాడు.

అమ్మాయి బాలకృష్ణవైపు చూడలేదు.

బాలకృష్ణకు మధ్యాహ్నం కెమిస్ట్రీ క్లాసు గుర్తుకు వచ్చింది. లెక్చరరు శివరాం మనసులో మెదిలాడు. అతను అగ్గిపుల్లని గోడకు గీసి టప్‌మని వెలిగించే తీరు జ్ఞప్తికి వచ్చింది. శివరాం క్లాసుకు వెళ్లాలా...?

బస్టాపులోకి బర్రుమని శబ్దం చేస్తూ ఇరవై నంబరు బస్సు వచ్చింది.

రెండు జడల అమ్మాయి ఎందుకో నవ్వుతూ బాలకృష్ణవైపు చూస్తూ ఆ బస్సు ఎక్కేసింది. ఆ బస్సు ఆనంద్ థియేటర్‌కు పోతుంది. ఆనంద్ థియేటరులో 'ప్రేమించుకుందాం రా!' సినిమా ఆడుతోంది.

ఆ అమ్మాయి సినిమాకేనా..?

"బా వూ!"

బాలకృష్ణ వెనక్కి తిరిగాడు. చుట్ట నోట్లో పెట్టుకుని కూర్చున్న తాత అగ్గిపెట్టె అడిగాడు. బాలకృష్ణ అగ్గిపెట్టెని తాత చేతికిచ్చాడు. ఒకే ఒక అగ్గిపుల్ల గీసి తాత చుట్ట వెలిగించుకున్నాడు.

"నువ్వు నా మనవడిలా వున్నావు... నీకో మాట సెప్పనా?" తాత నవ్వుతూ అడిగాడు.

బాలకృష్ణ ఏమిటన్నట్లు చూశాడు.

"నాలుగగ్గిపుల్లలు టప్పుటప్పుమని గీసిపడేసినవు. అయిదో అగ్గిపుల్ల గీసినట్టే... జేగర్తగా... నిలకడగా మొదటిదాన్నే గీసినావనుకో... మొదటగ్గిపుల్లే ఎలిగేది గాదా?"

బాలకృష్ణ మాట్లాడలేదు. మనసులో ఏదో వెలిగినట్లయింది.

తాత ముఖంలోకి నిదానంగా చూశాడు. తాత మాటలు నిజమేననిపించింది.

నాలుగగ్గిపుల్లలు తను నిర్లక్ష్యంగా గీసి వృథా చేశాడా? అంటే... నీకు ఏకాగ్రత, స్థిరత్వం లేవని తాత పరోక్షంగా హెచ్చరిస్తున్నాడా?

బస్సు కదిలిపోతోంది. బస్సులో రెండు జడల అమ్మాయి... 'ప్రేమించుకుందాం రా!" సినిమా...? వెళ్దామా..?

అమ్మాయి... సినిమా...? శివరాం కెమిస్ట్రీ క్లాసు?

కెమిస్ట్రీ లెక్చరర్ శివరాం! అసలే ఫైర్ మాస్టర్! క్లాసుకు వెళ్లకపోతే గోడకు అగ్గిపుల్ల గీసి వెలిగించినట్టు... ఎండలో ఒకపూటంతా నిలబెట్టి...

బాలకృష్ణ సిగరెట్ నేలమీదకు విసిరికొట్టాడు. విసురుగా కాలేజీ గేటువైపు అడుగులు వేశాడు.

వేస్తూ... వెనక్కి తిరిగి, "సారీ, తాతా! నీ అగ్గిపెట్టెలోని, నాలుగు పుల్లల్ని వృథా చేశాను... సారీ!" అన్నాడు.

❀ ❀ ❀ ❀ ❀ ❀

(ఆంధ్రప్రభ... కథాప్రభ - 3 ఆగష్టు 1998)